# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 78 | విశాఖపట్నం | 18-12-2025 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 78 | VISAKHAPATNAM | 18-12-2025 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## ప్రజలు సంతృప్తి చెందేలా కలెక్టర్లు

# సేవలందించాలి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** మనం ఏ పని చేస్తున్నా వివరాలు సమగ్రంగా ఉండాలన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. అనుకున్న సమయానికి లక్ష్యాలు నెరవేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. పలు అంశాలపై కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వ్యవస్థలో ఉండే లోపాలతో పని తప్పించుకునే యత్నాలు సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. రెవన్యూ శాఖలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్న ఆయన, ఫైళ్లను పరిష్కరించుకుండా తమ వద్ద నుంచి వేరే వారికి పంపించేస్తున్నారని విమర్శించారు. ఫిర్యాదులన్నీ పరిష్కారం కావాలని, డేటా డ్రివెన్ గవర్నెన్సు ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల్లో మరింత సమర్ధవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటుపాట్లను సవరించుకుంటేనే ప్రజల్లో సంతృప్తి వస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్య విద్యార్థుల్లా నిరంతరం వివిధ అంశాలు నేర్చుకుంటూ అభివృద్ధిలో భాగమవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రజా పాలనలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుగా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు. “నిరంతరం నేర్చుకునే పనిలోనే ఉండాలి. మంచి ఆలోచన ఎవరు ఇచ్చినా స్వీకరిద్దాం. చేసే పనిలో బాధ్యత, జవాబుదారీతనం ఉండాలి. మెరుగైన ఫలితాలు వచ్చే వాటికి ప్రాధాన్యత ఇస్తున్నా. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఎలా పని చేస్తున్నాం అనేది ముఖ్యం. మనం చేసే పని వల్ల ప్రజలు మనతో కలిసి వస్తున్నారా? లేదా? అనేది గమనించాలి. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా కోర్టు కేసులను దాటుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చాం. అంతకుముందు డీఎస్సీ పెట్టాం దానికి కూడా ఇలాగే గందరగోళం సృష్టించారు. బాధ్యత కలిగిన ప్రభుత్వమంటే అధికారాలు దుర్వినియోగం కాదు సద్వినియోగం కావాలి. అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందించే ప్రయత్నం చేస్తున్నాం” అని చంద్రబాబు తెలిపారు. జీఎస్డీపీ, కేపీఐ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధిం చేందుకు కలెక్టర్ల సదస్సులో చర్చిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల ద్వారా ఫలితాలు ఎలా వస్తున్నాయన్నదే ముఖ్యమని (తరువాయి 2వ పేజీలో)

## మహిళా క్రికెటర్ శ్రీచరణికి

# రూ.2.5 కోట్ల నగదు ప్రోత్సాహకం

### చెక్ అందజేసిన మంత్రి లోకేశ్



**అమరావతి, డెక్కన్ న్యూస్:** మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన క్రికెటర్ శ్రీచరణికి కూటమి ప్రభుత్వం రూ.2.50 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో క్రికెటర్ శ్రీచరణిని కలిసిన మంత్రి నారా లోకేశ్ స్వయంగా ఆమెకు చెక్‌ను అందజేశారు. కడప జిల్లాకు చెందిన శ్రీచరణి అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. రూ.2.50 కోట్ల నగదు ప్రోత్సాహంతో పాటు విశాఖలో 500 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించింది. డిగ్రీ పూర్తయిన తర్వాత గ్రూప్-1 హోదా ఉద్యోగాన్ని కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



7లో

## జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాలపై సర్వే!

# శిథిలావస్థలో సర్కారు బడి!



**మల్కాపురం, పతాకం న్యూస్:** విద్యాశాఖ వ్యవస్థలో గొప్పగా మార్పులు తీసుకొచ్చామని కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు చేస్తుంది కానీ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం.. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు శిథిలమైన భవనాలుగా మారుతున్నా.. సంబంధిత ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు. క్షేత్రస్థాయిలో దీనికి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో జి.వి.యం.సి 59వ వార్డు కొత్త నక్కవానిపాలెంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లలు మరియు తల్లి తండ్రులు తమ పిల్లలను శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు పంపించడానికి భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల తరగతి గదుల్లో పెచ్చులు ఉడిపోయి ఇనుప ఊచలు ప్రమాదకరంగా బయటకు కనిపిస్తున్నాయి. ఏ క్షణంలో పెచ్చులూడి పడతాయో ఏమో అని పిల్లలు మరియు తల్లితండ్రులు , ఉపాధ్యాయులు భయంభయంగా గడుపుతున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు విద్యాశాఖ ఉన్నత అధికారులకు, ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లిన నేటికి ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 24 మంది పిల్లలు, ఇద్దరు ఉపాధ్యాయలు ఇద్దరు ఆయాలు వినియోగంలో ఉన్న భవనాన్ని పున నిర్మించాలని గ్రామ పెద్దలు పిల్లలు తల్లి తండ్రులు పలువురు అధికారులను కోరుకుంటున్నారు. ఎమ్మెల్యే ఈ సమస్యను పట్టించుకోకపోవడం పట్ల మా దురదృష్టమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

## అనితకు కృతజ్ఞతలు

# తెలిపిన లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను హోంమంత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ఒక యజ్ఞంలా పూర్తి చేశారంటూ హోంమంత్రి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “యువగళం పాదయాత్రలో కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు (తరువాయి 2వ పేజీలో)



## చలికాలంలో 'గుండెపోటు'కు కారణాలివే!

6లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# పెన్షనర్ల భద్రత?

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్ల మీద దొడ్డిదారిన దాడికి దిగుతున్నది. అందులో భాగమే ఫైనాన్స్ బిల్లు పేరుతో జనవరి 2025న పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించిన పెన్షన్ చెల్లింపులకు సంబంధించిన నూతన సవరణ బిల్లు. వాస్తవానికి సుప్రీం కోర్టు చెప్పిన తీర్పు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను సవరించిన ప్రతిసారీ వారితోపాటు ప్రభుత్వ పెన్షనర్ల పెన్షన్‌ను కూడా సవరించి పెరిగిన ధరల భారం నుంచి వారికి ఉపశమనం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఇప్పుడు కొత్తగా ఆమోదించిన పెన్షన్ సవరణల చట్టం ప్రకారం ఆ బాధ్యత నుండి ప్రభుత్వం వైదొలగాలని చూస్తున్నది. ఈ సవరణల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తాజాగా నియమించిన 8వ పే కమిషన్ సిఫార్సులు, అమలు జరిగే తేదీకి ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు వర్తించవు. భవిష్యత్‌లో (8వ పే రివిజన్ కమిషన్ అమలు తేదీ తరువాత ) ఎవరైతే రిటైర్ అవుతారో వారికి మాత్రమే వర్తిస్తాయి. సూటిగా చెప్పాలంటే 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలు తేదీకి ముందు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు 8వ పే రివిజన్ కమిషన్ పెన్షన్ కోసర చేసిన సిఫార్సుల ప్రకారం పెన్షన్ రివిజన్ కాదు. అంటే ఫైనాన్స్ బిల్లు-2025తో పాటు తీసుకొచ్చిన ఈ పెన్షన్ సవరణ బిల్లు ద్వారా పెన్షనర్ల ఐక్యతకు గండి పడుతుందని అర్థం. అనగా 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలైన తేదీ తర్వాత ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు, 8వ పే రివిజన్ కమిషన్ సిఫార్సులు అమలుకాక ముందు ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు మధ్య స్పష్టమైన విభజన రేఖ గీస్తున్నారన్నమాట. అంటే ఇది పెన్షనర్లను రెండు ముక్కలుగా చీల్చి వారి ఐక్య పోరాట శక్తిని విచ్ఛిన్నం చేసే చర్య. నిజం చెప్పాలంటే 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ దేశ ప్రజలకు ఇచ్చిన అనేక హామీల్లో విశ్రాంత ఉద్యోగులకు భద్రత ఒకటి. కానీ ఈ రోజు దానిని గంగలో కలిపేసి బడ్జెట్ భారాన్ని సాకుగా చూపిస్తున్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడం చేతకాక ప్రజల సౌకర్యాలకు ఎసరు పెట్టడం ముఖ్యంగా ప్రజల సామాజిక హక్కులను కాలరాయడం గర్హనీయం. పెన్షనర్ల భద్రతకు కోత విధించే అధికారం ప్రభుత్వానికి లేదని అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసినప్పటికీ సదరు ఆదేశాలను లెక్కచేయకపోవడం అన్యాయం. రిటైర్మెంట్ సమయంలోనే ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. అప్పుడు పెన్షనర్లను ఆర్థికంగా ఆదుకోవటం అనేది ప్రభుత్వాల కనీస సామాజిక బాధ్యత. దానిని విస్మరించటం క్షమించరాని నేరం. నలభయ్యేళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ సేవలందించి రిటైర్మెంట్ తర్వాత వారికి చెల్లించే పెన్షన్‌లో పెరుగుదల లేకుండా బిల్లు తీసుకురావడం హేయమైన చర్య. ఉద్యోగ విరమణ పొందిన రోజు ఆ నెలలో పొందే మూలవేతనంలో సగం చెల్లించే పెన్షన్‌తో జీవితాంతం ఎలాంటి పెరుగుదల లేకుండా చేయడం అమానుషం. ఇది ఉద్యోగుల పెన్షన్‌పై 1982లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు పూర్తిగా విరుద్ధం. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఉద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేసి ఉద్యమిస్తున్న సమయంలో ఇలాంటి తిరోగమన, దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం పాల్పడటం అన్యాయమే కాదు, ఆటవికం కూడా. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనేక రూపాల్లో అధిక రాయితీలు ఇస్తూ ప్రజల సంపదను కారుచౌకగా వారికి దోచిపెడుతున్నది. అందుకు రాజ్యాంగ హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరిస్తున్నది. అందులో భాగంగానే 8వ వేతన సవరణ కమిటీ సిఫార్సుల అమలు తర్వాత రిటైర్ అయిన పెన్షనర్లతో సమానంగా అంతకు ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ చేయడానికి నిరాకరిస్తున్నది. పైగా సుప్రీంకోర్టు తీర్పులను వమ్ముచేసి, పెన్షనర్లకు న్యాయబద్ధంగా రావలసిన పెన్షన్‌ను చెల్లించటానికి బదులు వర్గీకరణను దొడ్డిదారిన చట్టబద్ధం చేయటానికి పూనుకున్నది. రిటైర్మెంట్ తేదీ ప్రకారం పెన్షనర్లను వర్గీకరించే అధికారం ప్రభుత్వానికి ఉందని అడ్డుగోలుగా వాదిస్తూ పెన్షన్ రూల్స్ పేరుతో ఫైనాన్స్ బిల్లు-2025లో కొన్ని నిబంధనలను చేర్చి ఈ వర్గీకరణ చేయడానికి పూనుకున్నది. ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాలను సైతం ఖాతరు చేయక ఏకపక్షంగా ఫైనాన్స్ బిల్లు-2025ను చట్టంగా మార్పు చేసి, తనకు గల మంద బలంతో చట్టసభల ఆమోదంతో పాటు రాష్ట్రపతి ఆమోదముద్రను కూడా పొందింది.

వాస్తవానికి పెన్షనర్ల వర్గీకరణకు అనుకూలంగా చట్టం చేయాలనుకుంటే అందుకు విడిగా ఒక బిల్లును ప్రవేశపెట్టి దానిపై చర్చించి పార్లమెంటు ఉభయసభల ఆమోదం పొందాలి. అటువంటి విషయాన్ని బడ్జెట్‌లో భాగమైన ఫైనాన్స్ బిల్లులో ఎలా చేరుస్తారు౫౦%? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం లేదు. వర్గీకరణ బిల్లును విడిగా పార్లమెంట్‌లో చర్చకు పెడితే దానిపై చర్చించి ప్రతిపక్షాలు ప్రశ్నిస్తాయని, అప్పుడు బిల్లును వాయిదా వేయాల్సి వస్తుందని భావించి ప్రభుత్వం ఈ పన్నాగం పన్నింది. అందుకే ఫైనాన్స్ బిల్లు-2025లో భాగం చేసి దొడ్డి దారిన పార్లమెంట్ ఆమోదం పొందటానికి తెగించింది.

### ఢిల్లీ వాయుకాలుష్యం సమస్యపై

# సుప్రీం కోర్టులో విచారణ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా ఆచరణాత్మక పరిష్కారం గురించి ఆలోచిద్దామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్య నియంత్రణ చర్యల నేపథ్యంలో పనులు నిలిచిపోయి ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ కార్యకర్త ఎంసీ మెహతా దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేకుండా ఉన్న కార్మికులను ముందుగా సరైన విధంగా గుర్తించి, వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేయాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక హెచ్చరిక చేసింది. కార్మికుల ఖాతాల్లో జమ చేసే డబ్బు ఎక్కడికో మాయమై, మరో ఖాతాకు వెళ్లిపోకుండా చూడాలని స్పష్టం చేసింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం స్పందిస్తూ, మొత్తం 2.5 లక్షల నిర్మాణ కార్మికుల్లో ఇప్పటివరకు కేవలం 7,000 మందినే వెరిఫై చేయగలిగామని, వారి ఖాతాల్లో త్వరలోనే డబ్బు జమ చేస్తామని కోర్టుకు ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. ఆంక్షల కారణంగా ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికులకు ప్రత్యామ్నాయ పని కల్పించేలా చూడాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది న్యాయస్థానం. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలు మూసివేయాలన్న ఢిల్లీ ప్రభుత్వ ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. శీతాకాల సెలవులు సమీపంలో ఉన్నందున, ఆ నిర్ణయంలో మార్పులు చేయాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. వాయి కాలుష్య సమస్యపై ప్రజల ఆరోగ్యం, కార్మికుల జీవనోపాధి రెండింటినీ సమతుల్యం చేసే విధంగా చర్యలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక వైసీపీ నాయకుల ర్యాలీలు: రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ప్రజల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి అధ్వానంగా పరిపాలన చేసిందని,అదే సమయంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారని రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్,బీజేపీ పాడేరు నియోజకవర్గం కన్వీనర్ కృష్ణారావు అన్నారు. మెడికల్ కాలేజీలు , హాస్పిటల్స్ ఎక్కడా ప్రైవేటీకరణ జరగలేదని స్పష్టం చేశారు.ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రైవేటీకరణకు అలాంటి అవకాశమే లేదన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత విస్తృతంగా అభివృద్ధి చేస్తూ,కేంద్ర ప్రభుత్వ సహకారంతో పుట్టిన బిడ్డ నుంచి చివరి శ్వాస వరకు ప్రతి పౌరుడికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించేలా వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు.గ్రామస్థాయిలో ఆశా వర్కర్ల నుంచి ఆసుపత్రుల డాక్టర్ సూపరింటెండెంట్ల వరకు సమన్వయంతో వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు అరిమెల రాజు,సొసైటీ డైరెక్టర్ ఆర్.చందర్రావు,మండల అధ్యక్షులు సంపరి శివకుమార్,పద్మరాజు,చక్రారావు,గాలి దేవుడు,సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## పెందుర్తిలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం



**పెందుర్తి, పతాకం న్యూస్:** 46వ జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ను పురస్కరించుకొని పెందుర్తి శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థల రాష్ట్ర పెన్సనర్స్ సంఘ అధ్యక్షులు పి. మల్లేశ్వరరావు అధ్యక్షతన సభను నిర్వహించారు. తొలుత సీనియర్ డిప్యూటీ లైబ్రేరియన్. డి.ఎస్. నకారా చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు. రాష్ట్ర సంఘ, జిల్లా ప్రతినిధులు కె. అప్పారావు, వి. పైడిరాజు, కె. సీతారామయ్య, పి. వి. ఎన్. పాత్రుడు, ఏ. వి. వి.ఎస్. ఎన్. మూర్తి, కె. ఎర్రయ్య, 'నకరా'గారి సేవలను కొనియాడారు. అనంతరం సీనియర్ పెన్షనర్, విశ్రాంత డిప్యూటీ లైబ్రేరియన్ పి. సత్యరాజు (91)ని రాష్ట్ర, జిల్లా సంఘ ప్రతినిధులు, పెందుర్తి శాఖా గ్రంథాలయాధికారి బి. చంద్రకళ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అంతకుముందు ఇటీవల పరమపదించిన షేక్ అమ్మాజీ, పి. సాధురావు అకాల మృతికి సంతాపం తెలుపుచు, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంకు అడివివరం గ్రంథాలయాధికారి ఎన్. వి. నరసింహం వందన సమర్పణ చేశారు.

# చోడవరం జనసేన ఇన్చార్జ్ రాజుకు అసమ్మతి సెగ

### ఇన్చార్జిని మార్చాలంటూ నిరసన గళం..
### రాజు వైఖరి పై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని ప్రకటన...



**చోడవరం, పతాకం న్యూస్ :** చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలం జనసైనికుల అసమ్మతి నిరసన సెగ తగిలింది. మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ సమావేశంలో పలువురు నాయకులు ఇన్చార్జ్ రాజు నాయకత్వంపై నిరసన గళం వ్యక్తం చేశారు. పార్టీ ఇన్చార్జిగా కార్యకర్తల మనోభీష్టం మేరకు నడుచుకోవడం లేదని, స్వార్ధపూరిత రాజకీయం చేస్తున్నారని నియోజకవర్గంలోనే జనసేన పార్టీకి అత్యంత ప్రజాదరణ తో అధిక ఓటింగ్ శాతం ఉన్న బుచ్చయ్యపేట మండలాన్ని విస్మరించడమే కాక కార్యకర్తలను, నాయకులను పట్టించుకోని రాజు నాయకత్వంలో తాము పనిచేయబోమంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. తన స్వార్థం కోసం బుచ్చయ్యపేట మండలం నాయకులకు, కార్యకర్తలకు ద్రోహం చేయడం తగదని, కార్యకర్తలకు ఏమాత్రం అందుబాటులో లేని ఇటువంటి నాయకుడు తమకు అవసరం లేదంటూ వడ్డాది సహకార సంఘం మాజీ పిఎస్ఏఎస్ అధ్యక్షులు దొండా సన్యాసిరావు విరుచుకుపడ్డారు. మండలంలో ఇటీవల జరిగిన సహకార సంఘ ఎన్నికలలో జనసేన పార్టీకి ఏమాత్రం ప్రాతినిధ్యం కల్పించకపోవడనికి పి వీ ఎస్ ఎన్ రాజు పోకడలే కారణమని బహిరంగంగానే తెలుస్తుందని కూటమి పొత్తులో భాగంగా మండల వ్యాప్తంగా ఆరు సహకార సంఘాలకు గాను వడ్డాది మేజర్ పంచాయతీ సహకార సంఘాన్ని జనసేన పార్టీకి కేటాయించడం జరిగింది. అయితే ఆ పదవిని తమ పార్టీకి కేటాయించాలంటూ నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు చేపడుతున్న పి వీ ఎస్ ఎన్ రాజు సిఫారసు చేయకపోవడం వలన టిడిపికి కేటాయించవలసి వచ్చిందని బహిరంగంగానే రాజు పై విమర్శలు వినబడుతున్న మాట వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. వడ్డాది సహకార సంఘం అధ్యక్ష పదవిని ఏమి ఆశించి టిడిపికి కట్టబెట్టారంటూ కార్యకర్తలు బహిరంగంగానే ప్రశ్నలు గుప్పించారు. చోడవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇన్చార్జిగా పీవీఎస్ఎన్ రాజును మార్పు చేయాలని కోరుతూ త్వరలో జిల్లా పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబును కలిసి వినతి పత్రం అందజేస్తామని జనసైనికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ గుండు గణేష్, దొండ సాయి,దొండ సన్యారావు, సీతా గణేష్, షేక్ రసూల్,అనిల్, గంట్ల నరేష్,మండపాక బాబురావు, ఎడ్ల రామ్మూర్తి, గోకివాడ మహేష్, పేదిరెడ్ల మనోహర్, రేణం శ్రీను, గణేష్, సుంకరి శ్రీను, సుంకరి చరణ్, కొల్లిమల్ల శ్రీను, తోపాటు పలు గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన

**రావికమతం, పతాకం న్యూస్:** మండలంలో గల సిద్ధి వినాయక సేవా సంఘం, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ డైరెక్టర్ పి. రమేష్, జిల్లా అధ్యక్షులు అప్పారావు, సత్యనారాయణ, బుచ్చయ్యపేట, మాడుగుల, చీడికాడ. నర్సీపట్నం, అనకాపల్లి, మునగపాక మండలాల జిల్లా నాయకులు, మండల నాయకులు అందరూ విచ్చేశారు. ముఖ్యంగా జిల్లా నుండి యూత్ అధిక సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమం లో రావికమతం ప్రెసెంట్ మూర్తి, సెక్రెటరీ పోతురాజు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## సేవలందించాలి: చంద్రబాబు

అన్నారు. ఉపముఖ్యమంత్రి వేరే రంగం నుంచి వచ్చినా పరిపాలనలో చక్కటి పనితీరు కనబరుస్తున్నారని ప్రశంసించారు. నియామకపత్రం తీసుకున్న ఓ కానిస్టేబుల్ తన ఊరికి రోడ్డు లేదని అడిగితే తన శాఖకు సమాచారం పంపి అదే వేదిక నుంచి ఆ రోడ్డుకు రూ. 3.90 కోట్లు పవన్ మంజూరు చేయించారని తెలిపారు. ప్రతీ శాఖ ఆన్ లైన్ ద్వారా ఫైళ్లు నడపాలని సూచించారు. గత పాలకుల నిర్వాకం వల్ల కేంద్ర పథకాలన్నీ నిర్వీర్యం అయిపోయాయని, వాటిని తిరిగి ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పీపీపీ ద్వారా మెరుగ్గా సేవలు అందుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడుతున్నా అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే నడుస్తాయన్నారు. సీట్లు కూడా పెరుగుతాయని చెప్పారు. 500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వృథా చేశారని, ఆ డబ్బుంటే రెండు మెడికల్ కాలేజీలు నిర్మించే వాళ్లమని సీఎం తెలిపారు. గత ప్రభుత్వంలో అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చారని విమర్శించారు. 13-14 శాతంతో అప్పులు తీసుకువచ్చి సమస్య సృష్టించారని మండిపడ్డారు. వీటిని రీ-షెడ్యూలింగ్ చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అభివృద్ధి - సంక్షేమం రెండింటిని సమపాళ్లలో తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పెద్దఎత్తున గృహనిర్మాణాలు చేపడుతున్నామని, అందరికీ ఇళ్లు అందేలా చేస్తున్నామన్నారు. పీ4 ద్వారా పేదలకు చేయూత అందించటమే అనేది ప్రతిపక్షాలు కూడా అర్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వారసత్వంగా 70 శాతం మేర ధ్వంసమైన రోడ్లు వచ్చాయని సీఎం అన్నారు. నీటి సమస్యలు, మద్దతు ధరలు లేకపోవటం, భూ వివాదాలు, విద్యుత్ బిల్లులు ఎక్కువ రావటం లాంటి సమస్యలు కూడా గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పెద్ద ఎత్తున వచ్చినవేనని తెలిపారు. ఇళ్లు లేని పేదలు, రైతులు, మహిళలు, పిల్లలు, యువత ఇలా అన్ని వర్గాలకు మంచి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూలత వస్తుందని తెలిపారు. నీటి భద్రత, ఉద్యోగాల కల్పన, అగ్రిటెక్ లాంటి అంశాల ద్వారా ఈ వృద్ధిని సాదిద్దామన్నారు. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్సులను వేగంగా పరిష్కరించి పారదర్శకంగా ఆన్?లైన్??లో ఉంచాలన్నారు. ప్రతీ నిమిషం తనను తాను బాగా తీర్చిద్దుకునేలా సెల్ఫ్? అసెస్?మెంట్? చేసుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

## తెలిపిన లోకేశ్

కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన హోంమంత్రి వంగలపూడి అనితకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోంమంత్రి పూర్తి సహాయ, సహకారాలు అందించారు. సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోం మంత్రికి, అధికార, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# వైభవంగా 'వీఆర్ సిల్క్స్' ప్రారంభం.. యాంకర్ శ్రీముఖి సందడి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలోని సిరిపురం సంపత్ వినాయక స్వామి ఆలయానికి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'వీఆర్ సిల్క్స్' షాపింగ్ మాల్‌ను బుధవారం ప్రముఖ సినీ నటి, యాంకర్ శ్రీముఖి ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె షోరూమ్‌లోని వివిధ విభాగాలను కలియతిరిగి, వస్త్రాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ విశాఖవాసులకు అందుబాటులోకి వచ్చిన వీఆర్ సిల్క్స్, రాబోయే క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు ఒక ఉత్తమ ఎంపిక అని కొనియాడారు. నాణ్యతతో కూడిన వస్త్రాలను అతి తక్కువ ధరకు అందిస్తూ కస్టమర్ల ఆదరాభిమానాలు చూరగొనాలని ఆమె ఆకాంక్షించారు. వైజాగ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడి ప్రజల అభిమానం మరువలేనిదని పేర్కొంటూ అభిమానులకు అభివాదం చేశారు. అనంతరం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.రాణి మాట్లాడుతూ %ూ% కంచి, ధర్మవరం, బనారస్ వంటి ప్రముఖ ప్రాంతాల నుంచి నేరుగా సేకరించిన స్వచ్ఛమైన చేనేత చీరలు తమ ప్రత్యేకత అని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. డ్రెస్ మెటీరియల్స్ ఒకటి కొంటే మూడు ఉచితమని , పట్టు చీరలు : ఒకటి కొంటే రెండు ఉచితమని పట్టు వస్త్రాలపై 50% నుండి 70% వరకు భారీ డిస్కౌంట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. శ్రీముఖి వస్తున్నారనే సమాచారంతో ఆమె అభిమానులు ఉదయం నుంచే షోరూమ్ వద్దకు భారీగా చేరుకున్నారు. ఆమె అభిమానులతో సెల్ఫీలు దిగుతూ వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వెంకటరాణి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జామి హర్షవర్ధన, సిఏ టిఏ వినాయక రావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# గంజాయికి దూరంగా ఉండాలి



**పాడేరు, పతాకం న్యూస్:** గంజాయి సాగు, వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా గంజాయి వద్దు బ్రో పేరిట ఎస్పీ అమిత్‌బర్ధార్ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన సైకిల్ ర్యాలీని కలెక్టర్ జె ండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వాసన లేకుండా చేసేందుకు ఒక యుద్ధమే చేశామని, ఫలితంగా గతంలో పది వేల ఎకరాల్లో ఉండే గంజాయి పంట నేడు పది సెంట్ల విస్తీర్ణంలో సైతం లేదన్నారు. పోలీసు, ఈగల్ బృందం, వివిధ ప్రభుత్వ శాఖ సమన్వయంతో గంజాయి సాగు, రవాణాకు సంపూర్ణంగా అడ్డుకట్ట వేశామన్నారు. అయినప్పటికీ సరిహద్దు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి రవాణాజరుగుతున్నదని, దానికి పోలీసులు ప్రత్యేక చర్యలతో అడ్డుకట్ట వేస్తున్నారన్నారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని, తమ భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్ధార్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసకావద్దని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నియంత్రిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఈగల్ బృందం రూపొందించిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేశ్, ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో డ్రోన్ సేవలు



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలోని భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో వైద్య రంగంలో డ్రోన్‌లను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఇందులో భాగంగా పాడేరు కేంద్రంగా పలు పీహెచ్‌సీలకు డ్రోన్‌ను పంపిస్తూ దాని అమలును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా వైద్య సేవలందించే క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో తక్కువ సమయంలో ఆయా సేవలను అందించేందుకు గాను డ్రోన్‌ను వినియోగించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ ప్రాజెక్టును సంపూర్ణంగా విజయవంతం చేసి పాడేరు ప్రభుత్వాస్పత్రి నుంచి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు, పరీక్షల నమూనాలను తరలించనున్నారు. అలాగే భవిష్యత్తులో మన్యానికి, కేజీహెచ్‌కు డ్రోన్ సేవలను అనుసంధానం చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆస్పత్రులు, ఆరోగ్య ఉపకేంద్రాల మధ్య, అలాగే ఆస్పత్రికి గ్రామాలకు మధ్య దూరం ఎంతో ఉంటుంది. ఈ క్రమంలో సకాలంలో మందులు అందుబాటులో లేకపోవడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలు ఆలస్యం కావడం వంటి సమస్యలు నిత్యకృత్యం. వాటిని మరింత వేగవంతం చేస్తే గిరిజన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడంతో పాటు సమయం ఆదా అవుతుందనేది రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆలోచన. దీంతో వైద్య రంగానికి సాంకేతికతను జోడించి, మరింత వేగంగా అత్యవసర సేవలు అందించేందుకు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగానే మన్యం ప్రాంతంలో డ్రోన్ సేవలను వైద్య రంగంలో ఎలా వినియోగించుకోవచ్చుననే అంశంపై ప్రస్తుతం ప్రయోగాత్మక చర్యలు చేపడుతున్నారు. పాడేరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు పంపిణీ చేయడం, అలాగే పలు వ్యాధుల నిర్ధారణకు సంబంధించిన నమూనాల సేకరణ రవాణా, ఫలితాలు అందజేత వంటి పనులకు డ్రోన్ సేవలను వినియోగించాలనుకుంటున్నారు. ప్రస్తుతం మూడు కిలోల బరువుతో 45 నిమిషాల్లో 80 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యమున్న ఒక డ్రోన్‌ను పాడేరు నుంచి ప్రయోగాత్మకంగా ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ముంచంగిపుట్టు, అరకులోయ మండలం సుంకరమెట్ట, చింతపల్లి మండలం తాజంగి పీహెచ్‌సీలకు పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి మందులు పంపడం వంటి ప్రయోగాత్మక చర్యలు చేపట్టారు. అలాగే 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకు డ్రోన్ సేవలు అందించే ప్రయోగాలు చేయనున్నారు.

# చింతపల్లిలో ఘనంగా షర్మిలా జన్మదిన వేడుకలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పుట్టినరోజు జన్మదిన వేడుకలు ఘనంగా పురస్కరించుకొని చింతపల్లిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జన్మదిన వేడుకలను హర్షాతిరేకాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు పార్టీ కార్యకర్తలు యువజన నాయకులు పాల్గొని షర్మిల నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీమల నవభారత్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ చైర్మన్ శతక బుల్లి బాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకిపాటి బాబులు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, సాగిన వీరన్న పాడాల్ జిల్లా ఉప అధ్యక్షులు లకే రమణ జిల్లా సెక్రటరీ చింతపల్లి మండల అధ్యక్షుడు గెమ్మెలి రామచందర్, పాడేరు మండల అధ్యక్షుడు బాబు రావు జి మాడుగుల మండల అధ్యక్షుడు చిన్న చారి ఉల్లి వెంకట రమణ జిల్లా సెక్రటరీ యువ నాయకుల నాగేష్ పాల్గొన్నారు.

# చింతపల్లి ప్రభుత్వ ఐటీఏలో నూతన ప్రిన్సిపల్‌గా రామ్మోహన్ రావు

**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రభుత్వ ఐటిఐ చింతపల్లి నూతన ప్రిన్సిపాల్ గా వై రామ్మోహన్ రావు సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో డిఎల్టిసి శ్రీకాకుళం నందు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నా సమయంలో చింతపల్లి ఐటిఐ కి ప్రిన్సిపాల్ గా పదోన్నతి పై ఇక్కడకు రావడం జరిగింది.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి ఇలా పదోన్నతి పై రావడం చాలా ఆనందంగా ఉందని ఇక్కడ వాతావరణానికి చాలా త్వరగా అలవాటు చేసుకుని సంస్థని అభివృద్ధి చెయ్యడం తో ముందుకు తీసుకెళ్లడానికి అలాగే పిల్లల యొక్క భవిష్యత్తుని తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తూ అభివృద్ధి చేస్తారని ఆయన అన్నారు.

# నేటి నుంచి ఇంటింటా సర్వే



**అనకాపల్లి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం 'యునైటెడ్ ఫ్యామిలీ సర్వే'కు శ్రీకారం చుట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి 2026 జనవరి 12వ తేదీ వరకు సర్వే నిర్వహించాలి. ఇందులో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో సచివాలయాల సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు. గురువారం నుంచి సచివాలయాల సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సమగ్ర వివరాలు సేకరిస్తారు. వీటిని యూఎఫ్ఎస్ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసి ఈకేవైసీ చేయనున్నారు. ప్రతి కుటుంబంలో ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, ఇతర వివరాలను సేకరిస్తారు. ఆధార్ నంబర్, మొబైల్ నంబరు, కుటుంబ ఆదాయం, స్థిరాస్తుల వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. సర్వే ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుంది. జిల్లాలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో 3,600 మంది సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారని జిల్లా సమన్వయకర్త మంజులావాణి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలని సచివాలయాల ఉద్యోగులను ఆదేశించినట్టు చెప్పారు.

# గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ వెంటనే ప్రారంభించాలి: సీపీఎం



**చోడవరం, పతాకం న్యూస్ :** జిల్లాలో సహకార రంగంలో కొనసా గుతున్న గోవాడ చక్కెర కర్మాగారాన్ని మూసివేయడం రాష్ట్ర కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఎన్నికల సమయంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కొనసా గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని తుంగలో తొక్కింది. లాభాల్లో నడిచిన సహకార కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి మూసివేయాలని చూడడం పచ్చిదుర్మార్గం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ వెంటనే ప్రారంభించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడి 24 వేల మంది రైతులు, 20 చెరుకు కేంద్రాల పరిధిలో చెరుకు సరఫరా చేస్తూ జీవనం సాగించారు. ఈ రోజు ఆ రైతులను వదిలేసి, వారి చెరుకును శ్రీకాకుళం జిల్లా సంకిలి చక్కెర కర్మాగారానికి బలవంతంగా తరలించే పరిస్థితి తీసుకువచ్చారు. ఇది రైతులపై ప్రత్యక్ష దాడి తప్ప మరొకటి కాదు. ధర విషయంలోనూ రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది. గత ఏడాది గోవాడ ఫ్యాక్టరీ ద్వారా టన్నుకు రూ.3151 చెల్లించగా, ఈ ఏడాది సంకిలి యాజమాన్యం రవాణా ఖర్చులు మినహాయించి కేవలం రూ.2800 మాత్రమే, అది కూడా రెండు వారాలకు ఒకసారి చెల్లిస్తామని చెబుతోంది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిన ఈ సమయంలో ధర తగ్గించడం రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టుతోంది. గోవాడ ఫ్యాక్టరీ తెరవకపోవడం వల్ల రైతులకు ప్రత్యామ్నాయం లేకుండా సంకిలి యాజమాన్యం చెప్పిన ధరకే చెరుకును ఇవ్వాల్సిన పరిస్థితిని రాష్ట్ర కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. అదే విధంగా రైతులు, కార్మికులకు సుమారు 39 కోట్లు బకాయిలు చెల్లించాల్సి వుంది. నేటికీ వాటిని చెల్లించలేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలని, వెంటనే చెరుకు క్రషింగ్ ప్రారంభించాలని, రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.

# నీలకంఠపురంలో ఆంజనేయ స్వామి 12 వ వార్షికోత్సవం

**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని నీలకంఠపురం లో జరిగిన శ్రీ భక్త ఆంజనేయ స్వామి వారు 12 వ వార్షికోత్సవ తీర్థం సందర్భముగా లక్కీ డ్రిప్ ద్వారా బహుమతుల అందజేశారు. మొదటి బహుమతి రాజాం గ్రామ సోషల్ వర్కర్ ఆకుల నాగేశ్వరరావు కుమారుడు ఆకుల నిక్షిత్ కు టేబుల్ ఫ్యాన్, రెండో బహుమతి జి. ధనుస్క గ్రైండర్, మూడో బహుమతి రౌతు రాములమ్మ గ్యాస్ స్టవ్, అలాగే ఆకుల నాగేశ్వరరావు తరుపున రాజం మరిడి మాంబా అమ్మవారు తరుపున అలాగే 5 బహుమతి గోవాడ అక్షయ్ ఇస్త్రీ పెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమం లో తురకలపూడి పిఏసిఎస్ అధ్యక్షుడు కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో పదేళ్లుగా పేరుకు పోయిన చెత్తకు విముక్తి



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం డంపింగ్ యార్డులో టన్నుల కొద్ది చెత్తకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. కొండలా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ట్రోమెల్ యంత్రం సహాయంతో శుద్ధి చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో 2017లో ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్ ఏర్పాటు చేశారు. క్యూబ్ బయో ఎనర్జీ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు ఇక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బయట విక్రయించేవారు. మిగిలిన ఘన వ్యర్థాలు, పొడి చెత్తను డంపింగ్ యార్డులో పోగులు పెట్టారు. ఇది కొండలా పేరుకుపోయి ఏడెనిమిది వేల టన్నులకు చేరింది. తొలుత 6,250 టన్నులు ఉంటుందని అధికారులు అంచనా వేసి.. చెత్త శుద్ధి చేసి తరలించడానికి తరుణీ అసోసియేట్స్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ సంస్థ యంత్రాల సహాయంతో చెత్తను శుద్ధి చేస్తున్నది. ఘన వ్యర్థాలు, మట్టి, పునరుద్వాక ఇందనం (ఆర్‌డీఎఫ్)గా వేరు చేస్తుంది. ఆర్‌డీఎఫ్‌ని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కి తరలిస్తున్నారు. రోజుకు 200 నుంచి 300 టన్నుల చెత్తను శుద్ధి చేస్తున్నారు. భవిష్యత్తులో మునిసిపాలిటీల్లో డంపింగ్ యార్డులు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ఏ రోజు చెత్త ఆ రోజు శుద్ధి చేసేలా ప్రణాళికను రూపొందిస్తున్నట్టు తెలిసింది.

# అంగన్వాడీ టీచర్లకు స్పీకర్ అయ్యన్న చేతులమీదుగా 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను మరింత పారదర్శకంగా, సాంకేతికతతో మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నాతవరంలో నిర్వహించిన కార్యక్రమంలో నాతవరం, గొలుగొండ మండలాల ఐసీడీఎస్ పరిధిలోని 176 మంది అంగన్వాడీ టీచర్లకు అత్యాధునిక శాంసంగ్ 5జీ స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల నమోదు, ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆహార పంపిణీ, ఆరోగ్య వివరాల ఆన్‌లైన్ అప్‌లోడ్‌తో అవినీతి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ శ్రీగౌరి, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన ఇన్చార్జ్ సూర్యచంద్ర, టిడిపి అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# డౌనూరు, చిట్టెంపాడు సచివాలయాల తనిఖీ

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొ య్యూరు మండలంలోని చిట్టిపాడు,డౌనూరు గ్రామ సచివాలయాలను జి.ఎస్. డబ్ల్యూ.ఎస్ డిప్యూటీ ఎంపీ డీఓ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాల యం లో సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్‌తో పాటు ఇతర కీలక రిజిస్టర్లను పరిశీలించారు.సచివాలయ ఉద్యోగులు అందరూ క్రమశిక్షణతో సమయ పాలన పాటించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు ప్రజలకు సకాలంలో,సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## అసంపూర్తి భవనాలకు మోక్షం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గత ప్రభుత్వం 'మన బడి నాడు-నేడు' కార్యక్రమంగా పాఠశాలల్లో అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో మధ్యలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల పనులను సీఎస్ఆర్ నిధులతో చేపడతామని డీఆర్సీ సమావేశంలో కలెక్టర్ తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంనాటికి అదనపు భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం కింద 2023-24లో జిల్లాలో 604 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర పనుల కోసం రూ.250 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సదుపాయం వంటి988 పనులు మంజూరు చేసింది. మొత్తం మీద గత ఏడాది సాధారణ ఎన్నికల ముందునాటికి రూ.132 కోట్లు ఖర్చు చేసి 60 శాతం మేర పనులు పూర్తిచేశారు. అయితే ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో మంజూరుకాకపోవడంతో పనులు మందగించాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి పనులు ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. వసతి కొరత, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కొన్ని పాఠశాలల్లో వరండాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులపై దృష్టి సారించలేదు. వైసీపీ హయాంలో చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో దాదాపు ఏడాదిపాటు వాటి గురించి పట్టించుకోలేదు. కనీసం రెండో ఏడాది అయినా అసంపూర్తి పనులు మోక్షం లభిస్తుందని భావించగా నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రనిధులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పాఠశాలల భవనాలు, ఇతర పనులను పూర్తి చేయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరుతూ ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, పాఠశాలల్లో అసంపూర్తిగా వున్న భవనాలను సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఆయా భవనాల స్థితిగతులపై వివరాలు సేకరించి నివేదికను రూపొందించాలని సమగ్ర శిక్ష ఇంజనీర్లను ఆదేశించారు. దీంతో ఈ శాఖ సిబ్బంది ఆయా పాఠశాలలను సందర్శించి, అసంపూర్తిగా వున్న భవనాలు, ఇతర పనుల వివరాలను నమోదు చేసుకుంటారు. ఆయా పనులు పూర్తిచేయడానికి ఎంత మేర నిధులు అవసరమో అంచనాలు రూపొందిస్తారు.

## నెల్లిమెట్ట జంక్షన్ వద్ద ఒక లీటర్ లిక్విడ్ గంజాయి పట్టివేత.. ఒకరు అరెస్టు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. నమ్మకమైన సమాచారంతో నర్సీపట్నం రూరల్ ఎస్ఐ పి.రాజారావు, సిబ్బందితో కలిసి నెల్లిమెట్ట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి వాహనం నుంచి దిగి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని లగేజీ బ్యాగ్‌ను తనిఖీ చేయగా 1.01 కేజీ లిక్విడ్ గంజాయి లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టైన వ్యక్తి కేరళ రాష్ట్రానికి చెందినవాడిగా గుర్తించారు. సీలేరు ఏజెన్సీ ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కేరళకు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో 1.01 కేజీ లిక్విడ్ గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ప్రభుత్వ పింఛన్ దారుల సంఘ వనసమారాధన



**చోడవరం, పతాకం న్యూస్ :** లక్ష్మి పురం రోడ్డు లో గల మామిడితోటలో ప్రభుత్వపింఛన్ దారులసంఘ వనసమారాధన బుధవారం జరిగింది. అధ్యక్షులు వీరణాల చినబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో 80 ఏళ్ళు దాటిన బండారు అప్లనాయుడును సన్మానించారు. స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ జయ ప్రకాష్ హజరై సైబర్ మోసాలు , వృద్ధులకు భీమ,వడ్డీ అంశాల పై మాట్లాడారు. పాటలు పాడారు, జోక్స్ చెప్పారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు. హాజరైన పింఛను దారులకు జ్యూట్ బ్యాగులు అందజేశారు. పింఛనుదారుల సంఘానికి స్థలం, జీవిత దృవ పత్రాలు ఉచితంగా చేయించాలని తీర్మానం చేశారు. చినబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ వనసమారాధనలో సంఘం ప్రధాన కార్యదర్శి బంకపల్లి దక్షిణ మూర్తి, చిరికి దేవానంద్, టి. సత్యం, ఎ. వి. రామకృష్ణ, కసిరెడ్డి గౌరీశంకర్, టి. వి. రమణ, ఎ. జగనాథం, జె. కాసిరాజు, ప్రాత రాజశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## "కించుమండ సంత"లో మోసాలపై లీగల్ మెట్రాలజీ దాడులు



**దుంబ్రిగూడ, పతాకం న్యూస్:** ఉప నియంత్రికులు కే. థామస్ రవి కుమార్ ఆదేశాల మేరకు, గాజువాక లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కించుమండ గిరిజన వారపు సంత లో తూనికలు, కొలతల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.లీగల్ మెట్రాలజీ సహాయకులు మాట్లాడుతూ తనిఖీల్లో లీటర్ మోడ్ సెట్టింగ్‌తో మోసపూరితంగా గిరిజనుల నుంచి అధిక పంట కొనుగోలు చేస్తున్న కమిషన్ ఏజెంట్లపై 5 కేసులు నమోదయ్యాయి. అలాగే, ముద్ర లేకుండా వినియోగిస్తున్న 4 కాటాలపై కేసులు దాఖలయ్యాయి. శీతల పానీయాలను అధిక ధరలకు అమ్ముతున్న ఒక దుకాణంపై మరో కేసు నమోదు చేశామని అన్నారు.సంతలోని వ్యాపారులందరికీ హెచ్చరిక జారీ చేస్తూ, తూనికలు మరియు కొలతల్లో మోసం చేసినా లేదా వస్తువులను అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.మీరు ఏదైనా మోసం గమనిస్తే, లీగల్ మెట్రాలజీ శాఖకు ఫిర్యాదు చేయవచ్చు లేక హెల్ప్‌లైన్: 1967 లేదా స్థానిక కార్యాలయంలో సంప్రదించగలరు.

## మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా రావాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపడుతున్న అభ్యుదయ సైకిల్‌యాత్ర.. శ్రీకాకుళంలో విజయవంతంగా నిర్వహించారు. డీఐజీతోపాటు కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డీఐజీ మాట్లాడుతూ.. 'గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. మంచి సమాజ నిర్మాణం మంచి వ్యక్తుల వల్లనే సాధ్యమవుతుంది. ఏడాది కాలంలో రేంజ్ పరిధిలో సంకల్పం మిషన్, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 21,206 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాం. 16,321 గ్రామాలు/పట్టణాల్లో, 6,459 విద్యా సంస్థల్లో సంకల్పం కార్యక్రమాలు జరిగాయి. విద్యాసంస్థల వద్ద 388 డ్రాప్‌బాక్సులు, 4,094 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశాం. ఈ నెల 29న ఇచ్ఛాపురంలో అభ్యదయం సైకిల్‌యాత్రలో భాగంగా భారీ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తాం' అని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గంజాయిని తరిమికొట్టడానికి సమిష్టి ప్రయత్నం నిరంతరం కొనసాగించాలన్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.. గంజాయి నిర్మూలనతోపాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమేనన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని 1932, 112 నెంబర్లకు లేదా స్థానిక పోలీసులకు అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, డీసీఎంఎస్ చైర్మన్ అవినాష్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా.. తాండవ రిజర్వాయర్ శాశ్వత పరిష్కారం, రహదారుల అభివృద్ధికి భారీ నిధులు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నాతవరం, పతాకం న్యూస్:** రైతుల సంక్షేమం, గ్రామీణ రహదారుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నాతవరం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ రైతాంగానికి జీవనాడిగా ఉన్న తాండవ రిజర్వాయర్ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో చిన్న మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు రూ.8 కోట్లతో మరమ్మతులు చేపట్టి పంటను కాపాడేందుకు నీటిని విడుదల చేశామని చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో తాండవ రిజర్వాయర్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాతవరం-%తాండవ రోడ్డును ఇరిగేషన్ శాఖ నుంచి ఆర్ అండ్ బి శాఖకు మార్చి, రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నర్సీపట్నం నియోజకవర్గంలోని లింక్ రోడ్ల అభివృద్ధికి రూ.24 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఇందులో నాతవరం మండలంలోని 7 లింక్ రోడ్లకు రూ.8.42 కోట్లు కేటాయించడంతో పాటు, గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా మరో రూ.5.20 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధుల కొరత లేకుండా పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తసంపద కేంద్రం ఆవరణలో అల్లుకుపోయిన ముళ్లపొదలు



**కొత్తూరు, పతాకం న్యూస్:** మండలంలోని గూనభద్ర పంచాయతీలో చెత్తసంపద కేంద్రం ఆవరణలో పొదలు అల్లుకుపోయి, పిచ్చిమొక్కలతో నిండిపోవడం తో అడవిని తలపిస్తోంది.అలికాం-బత్తిలిప్రధానరహదారికి ఆనుకొనిఉన్న ఈచెత్త సంపద తయారీ కేంద్రం చుట్టూ ముళ్లపొదలు, చెట్లు, పొదలు, ఆకులు అలములతో నిండి ఉండడంతో చూసేవారికి భయంగొల్పిస్తోంది. ఇక చెత్త సేకరణ చేసేవారు ఈ సంపద తయారీ కేంద్రం పరిసరాల్లోకి వెళ్లేదాఖలాలులేవు. స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రజలను చైతన్యంచేశామని చెప్పే అధికారులు చెత్త సంపద కేంద్రం వైపు కన్నెత్తి చూడడంలేదని చెప్పడానికి గూనభద్ర చెత్తసంపద కేంద్రమే ఉదాహరణనని పలు వురు చెబుతున్నారు.ఇప్పటికైన అధికారులు మొద్దునిద్ర నుంచి చెత్త సంపద కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉప్పుటేరు వంతెనకు రూ.4 కోట్లు



**సోంపేట, పతాకం న్యూస్:** ఉప్పలాం, సిరిమామిడి పంచాయతీల పరిధిలో ఎర్రముక్కాం- ఎకువూరు గ్రామాల మధ్య ఉప్పుటేరుపై రోడ్డు, వంతెన పనులు పూర్తి చేసేందుకు ఎట్టకేలకు నిధులు మంజూ రయ్యాయి. 2007లో అప్పటి టీడీపీ ప్రభుత్వం లో నాబార్డు నిధులు మంజూరు కాగా పను లు ప్రారంభించి ఆ తరువాత ప్రభుత్వం మారడంతో అర్ధంతరంగా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం రాకతో మరలా ఆశలు చిగురించాయి. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినా ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు. ఎమెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మోహన్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. వంతెన ప్రాధాన్యం వివరించారు. దీంతో ఆయన స్పందించి ఉపాధి హామీ నిధుల నుంచి రూ.4 కోట్లు మంజూరు చేశారు. వంతెన పనులకు ఉపాధి నిధులు మంజూరయ్యాయని, పనులు వెంటనే పునః ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ పీఐయూ డీఈఈ రవికుమార్ తెలిపారు. దీంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేసి కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్ట్ రజనీకాంత్ తండ్రికి అశ్రు నయనాల మధ్య అంతిమ వీడ్కోలు



**గుంటూరు, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లో కనుమూసిన టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ వెల్లలచెరువు రజనీకాంత్ తండ్రి సాంబశివరావు (80) భౌతికకాయానికి బుధవారం గుంటూరులో పలు రంగాల ప్రముఖులు, జర్నలిస్టులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. సాంబశివరావు సుదీర్ఘకాలం పి అండ్ టి, బిఎస్ఎన్ఎల్ లలో పలు కార్మిక, ఉద్యోగ సంఘాల ఉద్యమాల్లో ప్రధాన భూమిక పోషించారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, నెడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కుటుంబ సన్నిహితుడు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, సిపిఎం నేతలు వై.వెంకటేశ్వరరావు, ఈదా మాధవరెడ్డి, నేతాజీ, నళినీకాంత్, రమాదేవి, ప్రమీల, జనసేన నేత బోనబోయిన శ్రీనివాసరావు, సిపిఐ నేతలు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జంగాల అజయ్ కుమార్, సహచర జర్నలిస్టులు ఎంబిజి తిలక్, శ్రీనివాస్, రవీంద్ర, గిరి తదితరులు సాంబశివరావు భౌతికకాయాన్ని సందర్శించి, ఘన నివాళులు అర్పించారు.

## టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చెయ్యండి



**భీమవరం, పతాకం న్యూస్:** జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణా లను త్వరితంగా పూర్తిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు పట్టణాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణా ల ప్రగతిపై కమిషనర్లతో కలెక్టర్, జేసీ మంగళవారం సమీక్షించారు. నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫేజ్-1 ఫేజ్-2 కింద 21,424 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 8,832 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడం జరిగిందని, 640 ఇళ్ల మంజూరు రద్దు కాగా ఇంకా 11,952 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉందన్నారు. సమావేశంలో టిడ్కో ఈఈ నారాయణరావు, మునిసిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఎం.ఏసుబాబు, టి.రామ్‌కుమార్, బి.విజయ సారథి పాల్గొన్నారు.

## జీరో టిల్లేజ్‌పై రైతులకు అవగాహన



**సీతానగరం, పతాకం న్యూస్:** జీరో టిల్లేజ్ పద్ధతిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి రెడ్డి అన్నపూర్ణ అన్నారు. చినభోగిలిలో మొక్కజొన్న జీరో టిల్లేజ్ సాగు చేస్తున్న రైతుల పంట పొలా లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోసిన తరువాత పొలంలో వరి మొదళ్లు ఉండగానే దుక్కి దున్నకుండా చదను చేసుకుని మొక్కజొన్న విత్తనాలను చల్లాలన్నారు. ఈ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. ఈ పంట ఆహార పంటగానే కాకుండా పశువులకు మేత, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా ఉపయోగ పడుతుందన్నారు. రబీలో వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేస్తే మేలన్నారు. ఆమెతో పాటు మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు నాయుడుపాలెం విద్యార్థి




**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, నాయుడుపాలెం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.యశస్విని యోగాసన స్పోర్ట్స్ అథారిటీ వారు అనకాపల్లిలో ఆగస్టులో నిర్వహించిన జిల్లా యోగ పోటీలలో బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనది. అనంతపురంలో జరిగిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ఈనెల 12వ తారీకు నుండి 14వ తారీకు వరకు నిర్వహించిన పోటీలో బి.యశస్విని వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించి డిసెంబర్ 29 (2025) నుండి జనవరి 2 (2026) వరకు మహారాష్ట్రలో జరుగునున్న జాతీయ స్థాయి యోగ పోటీలకు ఎంపిక అయినది. ఎన్టీపీసి వారు భాగస్వామ్యంతో యోగా శిక్షణ అందించడం వలన జాతీయ స్థాయికి ఎంపిక అయినందుకు ప్రధాన ఉపాధ్యాయులు పి.వెంకట సురేష్, వ్యాయమా ఉపాధ్యాయిని బి.శ్రీలక్ష్మి, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, ఎన్టిపిసి యోగ శిక్షకులు సిహెచ్.ఆంజనేయులుని, విద్యార్థిని బి.యశస్విని అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు యశస్వినికి జాతీయస్థాయికి వెళ్ళుటకు ఆర్థిక సహాయం అందజేశారు.

## పుట్టినరోజున పది మొక్కలు నాటుదాం: కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్

**అరకులోయ, పతాకం న్యూస్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పుట్టినరోజు ను పచ్చదనంతో జ్ఞాపకంగా మలచే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అరకు వ్యాలీలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి పి. నాగబాబు తన పుట్టినరోజు సందర్భంగా కళాశాల ఆవరణలో 10 పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి వ్యక్తి బాధ్యత వహించాలని, మొక్కల నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వారసత్వాన్ని అందించవచ్చని అన్నారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి. నాగబాబు, వై. విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున కనీసం 10 మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అలవాటును పాటించి పర్యావరణానికి కృషి చేయాలని, గ్రామాల్లో కూడా శుభకార్యాల సందర్భంగా మొక్కల నాటడాన్ని సాంప్రదాయంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.ఎం.ఎస్. గణేష్, బి. లచ్చన్న ఎస్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అటకెక్కిన నగర శివారు ప్రాంతాల్లో సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగర శివారు ప్రాంతాల్లో సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు అటకెక్కాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ఆయా లేఅవుట్‌లలో పనులుచేసే బిహార్ కూలీలు సొంత ఊళ్లకు పయనమయ్యారు. సుమారు నాలుగు నెలలుగా బిల్లులు అందకపోవడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి పలువురు కాంట్రాక్టర్లు తప్పించుకు తిరుగుతున్నారు. ప్రధానంగా పెట్రోల్‌బంకులు, హార్డ్‌వేర్ షాపులు, కిరాణా దుకాణాలకు భారీగా బకాయిలు పడ్డారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బిల్లులు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రభావం పడింది. వర్షాలు తగ్గడంతో పనులు ముమ్మరంగా సాగాల్సిన సమయంలో కూలీలను కొనసాగించలేక కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు. రోజుకు కనీసం 200 ఇళ్లు పూర్తి, మరికొన్ని ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకావని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. హౌసింగ్ ఉన్నతాధికారుల తీరు ప్రభుత్వ పాలనపై పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇళ్లు పూర్తిచేయాలని మరోవైపు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఆప్షన్-3 కింద జిల్లాలో 65 లేఅవుట్‌లలో 1,14,821 ఇళ్లు కేటాయించగా వాటిలో 80,400 ఇళ్లు మంజూరుచేశారు. ఇప్పటివరకు 33,392 పూర్తిచేశారు. మిగిలిన 47,008 వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో 3,692 ఇళ్లకు కోలమ్స్ వేయగా 18,481 ఇళ్లకు పునాదులు వేశారు. మరో 12,300 ఇళు బేస్‌మెంట్ స్థాయికి వెయ్యి ఇళ్లు గోడలు వరకు, నాలుగువేల ఇళ్లు రూఫ్‌స్థాయికి, స్లాబ్ వేసేందుకు ఏడువేల ఇళ్లు ఉన్నాయి. ఇంకా 34వేల ఇళ్లు మంజూరుచేయాల్సి ఉంది. మొత్తం 65 లేఅవుట్‌లలో పనులకు సంబంధించి రూ.90 కోట్ల వరకు బిల్లులు ఇవ్వాల్సి ఉందని అంచనావేస్తున్నారు. నాలుగు నెలల నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోడంతో పనులపై ప్రభావం పడింది.

బిల్లులు ఇస్తామని హౌసింగ్ అధికారుల భరోసాతో గత నెల రెండో వారం వరకు నెమ్మదిగా పనులు చేశారు. ఆ తరువాత కూలీల నుంచి ఒత్తిడి రావడంతో కాంట్రాక్టర్లు లేఅవుట్‌లకు వెళ్లక వర్క్ ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులతో పనులు చేయించారు. అయినా చెల్లింపులు లేకపోవడంతో కూలీలు సొంత రాష్ట్రానికి పయనమయ్యారు. ప్రతి లేఅవుట్‌లో మిషనరీ, మెటీరియల్ కాపలా కోసం కొంతమంది స్థానిక కూలీలను నియమించుకుని చిన్నపాటి పనులు చేస్తున్నారు. ఒకే చోట వందల మంది కూలీలతో పనులకు కాంట్రాక్టర్లు వెనుకంజవేశారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్ల నుంచి ఒత్తిడి రావడంతో గత నెలలో హౌసింగ్ అధికారులు యాప్‌ను రూపొందించి లేఅవుట్ వారీగా పనుల పురోగతి వివరాలు అప్‌లోడ్ చేయమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇళ్ల పురోగతిని దశలవారీగా యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాంట్రాక్టర్లు హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా బిల్లులు మంజూరుచేయాలని ఆదేశించారు. అయినా హౌసింగ్ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి. వచ్చే ఏడాది ఉగాదికి ఐదు లక్షల ఇళ్లను ప్రారంభిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో విశాఖ జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పూర్తిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇళ్లు పూర్తిచేస్తే గృహప్రవేశాలు చేద్దామని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

# సాగునీటి ప్రాజెక్టు పనులకు బ్రేక్

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆయకట్టును స్థిరీకరించాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరికొన్ని పూర్తిగా పడకేశాయి. నిధుల కొరతో, పెండింగ్ బిల్లుల భయమో కానీ.. కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారు. నారాయణపురం ఆనకట్ట నుంచి మైనర్ ఇరిగేషన్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. తాజాగా వెలుగు చూసిన నీటిపారుదల శాఖ నివేదిక జిల్లాలోని సాగునీటి రంగం దుస్థితికి అద్దం పడుతోంది. జిల్లా రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న నారాయణపురం ఆనకట్ట పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్యాకేజీ-ఏ: ఆనకట్ట హెడ్ వర్క్స్, ఎడమ ప్రధాన కాలువ పనులకు జైకా నిధులు రూ.62.46 కోట్లు మంజూరయ్యాయి. కానీ కాంట్రాక్టర్ కేవలం 35 శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు.


ప్యాకేజీ-బి : కుడి ప్రధాన కాలువ పరిస్థితి కూడా ఇంతే. రూ. 49.64 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉండగా.. 45 శాతం పనులు పూర్తయ్యాక కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు.మరో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే.. పనులు వందశాతం పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు చెల్లించలేదు. బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్ట వద్ద టీపీఆర్ పనులు, హెడ్ స్లూయిస్, స్కవరింగ్ స్లూయిస్(సుమారు రూ.1.86కోట్లు) శతశాతం పూర్తయ్యాయి. పని పూర్తయి చాలా రోజులవుతున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారులే నివేదికలో పేర్కొనడం గమనార్హం. బిల్లులు రావన్న భయంతోనే మిగతా పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్న వాదనకు ఇది బలం చేకూరుస్తోంది. పొందూరు మండలం కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట వరకు ఉన్న 'రెల్లిగెడ్డ నేచురల్ డ్రైన్' అభివృద్ధి పనులు (రూ.8.90కోట్లు) 55 శాతం పూర్తయ్యాయి. దీనిపై విజిలెన్స్ కేసు ఉండటంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. మిగిలిన పనుల కోసం రూ.22.92 కోట్లతో మళ్లీ అంచనాలు తయారుచేసి చీఫ్ ఇంజనీర్ కమిటీ ఆమోదం కోసం పంపామని అధికారులు చెబుతున్నారు. కానీ ఈలోపు వర్షాలు వస్తే ముంపు ముప్పు తప్పదని రైతులు వాపోతున్నారు.



వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద మత్స్యకారుల కోసం చేపట్టిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులు (రూ.11.95 కోట్లు) 40 శాతానికే పరిమితమయ్యాయి. గార మండలం కళింగపట్నం వద్ద వంశధార నదిపై రక్షణ పనులు కూడా అసంపూర్తిగానే మిగిలాయి. అలాగే ఏపీఐఎల్ఐపీ ప్యాకేజీలు ఏడు మంజూరు కాగా, ఒకటి మాత్రమే పూర్తయింది. మిగిలిన ఆరు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో రైతులు, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని పనుల రిమార్క్స్ కాలమ్‌లో 'కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు' అని ఉండటం గమనార్హం. అసలు కాంట్రాక్టర్లు ఎందుకు పనులు ఆపేస్తున్నారు? వారికి సకాలంలో బిల్లులు రావడం లేదా? లేక అధికారుల పర్యవేక్షణ లోపించిందా? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి నిధుల విడుదల చేసి కాంట్రాక్టర్లతో పనులు పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా నర్సీపట్నంలో ప్రత్యేక కార్యక్రమం

**నర్సీపట్నం, పతాకం న్యూస్:** మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం, యోగా అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమ వివరాలను బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా వర్చువల్‌గా నిర్వహిస్తున్న ధ్యానంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను స్పీకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి



ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని, ఆ ఒత్తిడిని జయించి ఆనందంగా జీవించాలంటే ధ్యానం ఒక్కటే మార్గమన్నారు. ప్రశాంతతకు ధ్యానం, ఆరోగ్యానికి యోగా దోహదపడతాయని తెలిపారు. డిసెంబర్ 21 ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, హైదరాబాద్ నుంచి ప్రముఖ ధ్యాన నిపుణులు హాజరై ధ్యానం చేసే విధానం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. రోజుకు కనీసం 15 నిమిషాలు ధ్యానం అలవాటు చేసుకుంటే అద్భుత ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని సుమారు 30 పాఠశాలలకు చెందిన 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని స్పీకర్ అయ్యన్న కోరారు.

# చలికాలంలో 'గుండెపోటు'కు కారణాలివే!

## వైద్య నిపుణులు ఏం చెప్తున్నారంటే!



వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గి, వెన్నులో వణుకు పుట్టించే చలితో పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. చిన్నారులకు ముక్కులో నుంచి రక్తం కారడం, చంటి పిల్లల్లో న్యుమోనియా, పెద్దల్లో ఆస్తమా పెరుగుతున్నాయి. గుండె సంబంధిత రుగ్మతలున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో రోజురోజుకూ పెరుగుతున్న చలి కారణంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు నిపుణులు. మరి, అవేటంటో ఇప్పుడు తెలుసుకుందాం!

శీతాకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. శరీరానికి ఎండ సరిగ్గా తగలక విటమిన్ డి లోపం తలెత్తి, రోగనిరోధక శక్తి క్షీణించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా వివిధ రకాల అనారోగ్యాలు చుట్టు ముడతాయని అంటున్నారు. మరి, ఈ సమస్యల్ని నివారించాలంటే ఈ కాలంలో లభించే కొన్ని ఆహారం, వ్యాయామాలతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

చలి తీవ్రత పెరగడంతో అనేక లక్షణాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

ఈ కాలంలో చిన్నారుల్లో తీవ్రమైన జ్వరాలు కనిపిస్తుంటాయని చెబుతున్నారు. ఊపిరితిత్తుల ఇన్?ఫెక్షన్లు ఎక్కువగా సోకుతుంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా న్యుమోనియా సోకకుండా జాగ్రత్తపడాలని తెలియజేస్తున్నారు.

అలాగే, అనేక రకాల అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలూ పిల్లలపై దాడి చేస్తుంటాయని పేర్కొంటున్నారు.

నెలలోపు వయసున్న పసిపిల్లల్లో 'హైపోథర్మియా' వచ్చే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అంటే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి వారి శరీరం చల్లబడుతుందని పేర్కొంటున్నారు. ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పసిపిల్లల్ని వెచ్చగా ఉంచాలని సూచిస్తున్నారు. అలాగే, పొడి వాతావరణం వల్ల ముక్కు ఎండిపోయి లోపల నుంచి రక్తస్రావం జరుగుతుందని పేర్కొంటున్నారు. జలుబు తీవ్రంగా ఉండడం వల్ల ఎక్కువసార్లు ముక్కు చీదినా, లోపల తరచూ వేలు పెట్టినా రక్తం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

శీతల వాతావరణం గుండె సమస్యలున్న వారికి ప్రమాదకరం. రక్తనాళాలు సంకోచించడం వల్ల హైబీపీకి దారితీస్తుంది. తద్వారా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. చల్లని వాతావరణం వల్ల రక్తం చిక్కబడి క్లాట్స్ ఏర్పడే ప్రమాదం ఉంది. శ్వాసకోశ సంబంధిత సమస్యల వల్ల గుండెకు సరఫరా అయ్యే ప్రాణవాయువు శాతం తగ్గడంతో దాని పనితనం దెబ్బతింటుంది. చలిగా ఉందని చాలా మంది శారీరక శ్రమ లేదా వ్యాయామం తగ్గిస్తారు. దీనివల్ల గుండె సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలున్న వారు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. ఉదయం కాస్త ఎండ వచ్చాక వ్యాయామం కొనసాగించాలి. జన సమూహంలోకి వెళ్లినపుడు మాస్కులు ధరించాలి. కొవ్వు పదార్థాలను తినకూడదు. చక్కెర ఎక్కువ కలిగిన ఆహారాన్ని నిషేధించాలి. ఏదైనా ఇబ్బంది కలిగితే వైద్యులను వెంటనే సంప్రదించాలి.

ఈ సీజన్‌లో వ్యాధుల బారిన పడకుండా నిపుణుల సూచనలు:

అనారోగ్యకరమైన చిరుతిళ్ల జోలికి వెళ్లకుండా వేడి ఆహారాన్ని, ముఖ్యంగా ఆకుకూరలను భోజనంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. నూనెలు ఎక్కువగా ఉండే వేపుళ్లు, పిండి వంటలను కట్టడి చేయాలని పేర్కొంటున్నారు. వేడివేడి సూప్‌లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఈ కాలంలో దాహం లేదని పిల్లలు మంచి నీళ్లు ఎక్కువగా తాగరు. దీనివల్ల చర్మం, పెదవులు పొడిబారి రక్తస్రావం జరుగుతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి దాహంగా అనిపించకున్నా నీళ్లు తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు. రోజుకు కనీసం రెండు, మూడు సార్లు చర్మానికి మాయిశ్చరైజర్లు రాసి పొడి బారకుండాచూసుకోవాలంటున్నారు. చలి ఎక్కువగా ఉంటే వ్యాయామం ఇంటి లోపల చేయొచ్చని చెబుతున్నారు. కాస్త ఎండ వచ్చాక నడక, ఇతర శారీరక శ్రమ కలిగించే ఎక్సర్‌సైజ్‌లు తప్పనిసరంటున్నారు. ఉన్ని దుస్తులతో చలి తగలకుండా వెచ్చగా ఉండడం అందరికీ మేలని సూచిస్తున్నారు

# సౌందర్య సంరక్షణకు 'మునగ నూనె'



మహిళలు అందంగా కనిపించాలని ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. వంటింట్లో లభించే సహజ సిద్ధమైన పదార్థాల్నే సౌందర్య పోషణ కోసం ఉపయోగిస్తుంటారు. అయితే మీరు వాడే నేచురల్? బ్యూటీ ప్రొడక్ట్స్?లో మునగ నూనెను కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు. మునగ గింజలను ఎండబెట్టి, వాటి నుంచి తీసిన ఈ నూనె అందాన్ని రెట్టింపు చేయడంలో సమర్థంగా పనిచేస్తుందని చెబుతున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

మునగ నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల కాలుష్య ప్రభావంతో పాడైన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే, రోజువారీ పనుల వల్ల కలిగే అలసట, ఒత్తిళ్ల నుంచి కూడా ఇది ఉపశమనం కలిగిస్తుందంటున్నారు. ఇక ఈ నూనెను క్రమం తప్పకుండా ఉపయోగిస్తే చర్మం మృదువుగా మారడమే కాకుండా ప్రకాశవంతంగానూ కనిపిస్తుందని సూచిస్తున్నారు. పొడి చర్మతత్వం వారికి ఈ నూనె మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. ఇది నేరుగా చర్మం లోపలి పొరల్లోకి ఇంకి తేమనం దిస్తుందని చెబుతున్నారు. అలాగని జిడ్డుగా అనిపించదని, పగిలిన పెదవులకు కూడా దీన్ని అప్లై చేసుకుంటే అవి తిరిగి మృదువుగా మారతాయని సూచిస్తున్నారు. ఇందులో ఉండే ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజాలు అనేవి చర్మానికి తగినంత తేమతో పాటు పోషణ కూడా అందిస్తాయని వివరిస్తున్నారు. మునగ నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మం నవ యవ్వనంగా, ఆరోగ్యంగా కనిపించేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇందులోని విటమిన్ 'సి' కొలాజెన్ ఎక్కువగా ఉత్పత్తయ్యేలా చేసి చర్మం ముడతలు పడకుండా సంరక్షిస్తుందంటున్నారు. కాబట్టి, వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు. ఒకవేళ ముఖంపై సన్నటి గీతలుంటే అవి కూడా క్రమంగా తొలగిపోతాయని పేర్కొంటున్నారు. స్నానం చేసిన తర్వాత ఈ నూనెతో చర్మానికి మృదువుగా మర్దన చేసుకోవడం వల్ల రోజంతా తేమ నిలిచి ఉంటుందని వివరిస్తున్నారు. పగటి పూట ఇబ్బంది అనుకునేవారు, రాత్రి పూట నిద్రపోయే ముందు కూడా ఈ నూనెను చర్మానికి రాసుకోవచ్చని సలహా ఇస్తున్నారు. మోరింగ నూనెలో యాంటీమైక్రోబయల్, యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్, యాంటీ ఫంగల్, యాంటీ ఏజింగ్ లక్షణాలు ఉన్నాయని, ఇవి ముడతలు, నిర్జీవమైన చర్మం వంటి వృద్ధాప్య ప్రభావాలతో సహా అనేక చర్మ సమస్యలకు సహాయపడతాయని ప్రచురించింది. మునగ నూనెలో విటమిన్ 'సి', 'ఇ' సమృద్ధిగా లభిస్తాయి. ఇవి చర్మంపై ఉండే మచ్చలు పూర్తిగా తొలగిపోయేలా చేస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి, చర్మంపై ఉండే నల్లమచ్చలు, మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలు, పిగ్మెంటేషన్ లాంటి సమస్యలకు ఇది చక్కని పరిష్కారమని అధ్యయనం పేర్కొంది. అలాగే ఈ నూనెలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీసెప్టిక్ గుణాల వల్ల చర్మంపై కాలిన మచ్చలు, గాయాలు వంటివి త్వరగా నయమవుతాయని పేర్కొంటున్నారు. మునగ నూనె కేవలం చర్మానికే కాదు, కురులకు కూడా తేమనందిస్తుందని అంటున్నారు. ఇందుకోసం కాస్త మునగ నూనె తీసుకొని కేశాలు తడిగా ఉన్నప్పుడు కుదుళ్లలోకి చేరేలా మృదువుగా మర్దన చేయాలని తెలియజేస్తున్నారు. ఈ నూనెని తరచూ ఉపయోగించడం వల్ల దృఢమైన కురులు సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు. అలాగే చుండ్రు, చిట్లిన చివర్లు వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందచ్చని వివరిస్తున్నారు.ఇవి కూడా : మునగ నూనెని ఫేషియల్ క్లెన్సర్‌గా కూడా ఉపయోగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అనేవి సూర్యరశ్మితో కమిలిన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకువస్తుందని అంటున్నారు. అంతేకాకుండా, దీన్ని హెయిర్ సీరమ్‌గా కూడా వినియోగించవచ్చని సూచిస్తున్నారు.

# జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాలపై సర్వే!

## కొత్తగా ఇళ్ల స్థలాలు పంపిణీకి ఖరారు కాని విధి విధానాలు



**గుంటూరు, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇచ్చేందుకు భూములను గుర్తించేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగా భూ సేకరణ చేయకుండా అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో భాగంగా తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 2020-21లో ఎంపిక చేసిన జగనన్న కాలనీల్లో ఉన్న స్థలాలపై జిల్లాల వారీగా ప్రభుత్వం సమాచారం సేకరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాల పంపిణీ జరిగింది. పట్టణాల్లో సెంటు (48 గజాలు), గ్రామాల్లో సెంటున్నర (72 గజాలు) చొప్పున పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణానికి దశల వారీగా అనుమతి ఇచ్చారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో దాదాపు 5.60 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. గత ఏడాదిన్నర కాలంలో మరో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేశారు. ఇళ్ల స్థలాలను (జగనన్న కాలనీలను) పట్టణాలకు దూరంగా ఎంపిక చేయడంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మొగ్గుచూపలేదు. గుంటూరు జిల్లాలో మొత్తం 2.32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, 60 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే ప్రారంభమైంది. గుంటూరు నగరంలో 60 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయిచగా, ఆరు వేల మంది మాత్రమే ఇల్లు నిర్మించారు. మిగతా స్థలాల్లో కొన్ని కాలనీల్లో గత ప్రభుత్వ హయంలో మౌలిక సదుపాయల కల్పన వివిధ దశల్లో ఆగిపోయింది. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్మాణం, తాగునీటి పైపు లైన్లు, లోతట్టు కాలనీలను మెరక చేయడం, కాలనీలకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం వంటి పనులు జరిగాయి. ఇవి కొన్నిచోట్ల పూర్తి కాగా, మరికొన్ని చోట్ల పనులు పలు దశల్లో నిలిచిపోయాయి. గుంటూరు నగరానికి చెందిన 18 వేల మందికి మేడికొండూరు మండలం పేరేచర్ల వద్ద లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించారు. కేవలం 500 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు వేలాది మంది విముఖత వ్యక్తం చేశారు. ఇలా వివిధ ప్రాంతాల్లో నిర్మించిన కాలనీల్లో స్థలాలు కేటాయించినా వారికి అనుకూలంగా లేవని చాలామంది ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. మరోవైపు కొత్తగా ఇళ్ల స్థలాల కోసం అధికారులకు దరఖాస్తులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల పరిస్థితి ఏమిటి? ఎంతమంది పొజిషన్‌లో ఉన్నారు? ఎంతమంది ఈ కాలనీలకు రావడానికి సుముఖంగా ఉన్నారు? ఎంతమంది విముఖత వ్యక్తం చేస్తున్నారు? ఎవరికీ కేటాయించకుండా ఖాళీగా ఉన్న స్థలాలు ఎన్ని? అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల నుంచి పూర్తి స్థాయి సమాచారం రాలేదని, ఈ మూడు శాఖలతో జిల్లాల వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల వారీగా వివరాల సేకరణ పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ప్రభుత్వం కొత్తగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలూ జారీ చేయలేదు. కేవలం ఖాళీ స్థలాలను గుర్తించాలని మాత్రమే చెప్పిందని జిల్లా అధికారులు తెలిపారు. అయితే, ప్రజాప్రతినిధులు మాత్రం చాలా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న జగనన్న కాలనీల్లోని స్థలాలపై పరిశీలన చేసి కొత్త వారికి స్థలాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

## జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై చింతపల్లి లో నిరసన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ



**చింతపల్లి, పతాకం న్యూస్:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ ఎంఎన్ ఆర్ ఈజీఏ జాతీయ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్పు ప్రయత్నం బాధాకరం. ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తాం. భారత ప్రభుత్వం నడిపిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంఎన్ఆర్ఈజీఏ చట్టానికి పేరు మారుస్తామన్న బీజేపీ ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడం తీవ్రంగా కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని ఆయన అన్నారు.ఇది నేరుగా గ్రామీణ ప్రజల హక్కుల మీద దాడి మరియు కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన చారిత్రక పథకాన్ని ప్రజల మధ్యలో లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుతంత్ర ఆలోచన వెనక్కి తీసుకోవాలని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎంఎన్ఆర్ఈజీఏ చట్టం 2005లో యూపీఏ ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టబడింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 100 రోజులు గ్యారంటీ పని హామీ ఇవ్వబడుతుంది. ఇది కోట్లాది పేద కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చిన పథకం దీనికి మహాత్మాగాంధీ పేరు జోడించడం దాని ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు ప్రతిబింబించడమే కాక భారతదేశ గ్రామీణ జీవన విధానానికి గౌరవం ఇవ్వడమే అని అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర?యాన్ని వెనక్కి తీసుకోలేని పక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

రీమల నవభారత కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కంకిపాటి బాబులు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, సాగిన వీరన్న పాడాల్ జిల్లా ఉప అధ్యక్షులు, లకే రమణ జిల్లా సెక్రటరీ, చింతపల్లి మండల అధ్యక్షుడు గెమ్మెలి రామచందర్, పాడేరు మండల అధ్యక్షుడు బాబు రావు, జి మాడుగుల మండల అధ్యక్షుడు చిన్న చారి, ఉల్లి వెంకట రమణ జిల్లా సెక్రటరీ, యువ నాయకుల నాగేష్ పాల్గొన్నారు

## ఘనంగా ముగిసిన నర్సీపట్నం డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

క్రికెట్ మొదటి విజేత గొలుగొండ మండలం,
ద్వితీయ విజేత ఎస్. రాయవరం
త్రోబాల్ (మహిళలు) మొదటి విజేత నర్సీపట్నం మండలం,
రెండొవ విజేత ఎస్. రాయవరం





**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్, త్రోబాల్(మహిళలు) పోటీలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. త్రో బాల్ పోటీల్లో నర్సీపట్నం మండల జట్టు విజేతగా నిలవగా, ఎస్.రాయవరం మండలం రన్నర్స్‌గా నిలిచింది. క్రికెట్ పోటీల్లో గొలుగొండ మండలం విజేతగా, వి.మాడుగుల మండలం రన్నర్స్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన నర్సీపట్నం జడ్పీటీసీ ఎస్.రమణమ్మ, డిప్యూటీ డీఈఓ అప్పారావు క్రీడలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనతో పాటు క్రీడలు కూడా అవసరమని, ఇలాంటి పోటీలు శారీరక దృఢత్వం, స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పి.గోవిందరావు, దాత వెలగా నారాయణరావు, నర్సీపట్నం ఎంఈఓలు సిహెచ్.తలుపులు, జీవీఎస్ నాగేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల(గర్ల్స్) ప్రిన్సిపాల్ శోభ, గొలుగొండ ఎంఈఓ సత్యనారాయణ, గోపీనాథ్, వరహాల నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు సిహెచ్.అప్పలస్వామి, ఎస్‌జీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ అచ్చమ్మ, డివిజన్ కోఆర్డినేటర్ టి.వి.రమణ, మండల కోఆర్డినేటర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# టీ20 ర్యాంకింగ్స్‌లో బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి నెం.1, బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ నెం.1



ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్ సంచలనం వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచుల్లో రెండేసి వికెట్లు పడగొట్టిన అతడు, కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు.

తాజాగా వరుణ్ చక్రవర్తి ఖాతాలో అదనంగా 36 రేటింగ్ పాయింట్లు చేరడంతో మొత్తం 818 పాయింట్లతో నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ (699) కంటే వరుణ్ 119 పాయింట్ల ఆధిక్యంలో ఉండటం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా నాలుగు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంకుకు చేరుకున్నాడు.

బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ భారత యువ ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ నెంబర్ 1 ర్యాంకును నిలబెట్టుకోగా, తిలక్ వర్మ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. దీంతో టీ20 ప్రపంచ కప్ 2026 నాటికి ఇద్దరు భారత బ్యాటర్లు టాప్ 5లో స్థానం సంపాదించారు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ నుంచి హార్దిక్ పాండ్యా (4), అక్షర్ పటేల్ (9) టాప్ 10లో ఉన్నారు. శివమ్ దూబే నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 16వ ర్యాంకుకు చేరుకున్నాడు.




## విజయ్‌తో పెళ్లికి ముందు బ్యాచిలరేట్ పార్టీ?
# రష్మిక శ్రీలంక ట్రిప్ వైరల్!





స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న, హీరో విజయ్ దేవరకొండ పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న వార్తలకు ఆమె తాజా ట్రిప్ మరింత బలాన్నిచ్చింది. ఇటీవల తన స్నేహితురాళ్లతో కలిసి శ్రీలంక వెళ్లిన రష్మిక, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోగా అవి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఇది కచ్చితంగా విజయ్‌తో పెళ్లికి ముందు చేసుకుంటున్న బ్యాచిలరేట్ పార్టీ అని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. తన బిజీ షెడ్యూల్ నుంచి రెండు రోజుల విరామం తీసుకుని, తన గర్ల్ గ్యాంగ్‌తో కలిసి శ్రీలంకలోని ఓ అందమైన ప్రదేశానికి వెళ్లినట్టు రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపింది. "ఎంత చిన్న ట్రిప్ అయినా సరే, అమ్మాయిలతో చేసే ప్రయాణాలే ఉత్తమమైనవి" అని తన పోస్టులో ఆమె రాసుకొచ్చింది.

రష్మిక దీనిని ఓ సాధారణ ట్రిప్‌గా పేర్కొన్నప్పటికీ, అభిమానులు మాత్రం దీనికో ప్రత్యేక అర్థం తీశారు.

ఆమె పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే కామెంట్ల సెక్షన్ నిండిపోయింది. "ఇది బ్యాచిలరేట్ పార్టీనా?" అని చాలామంది ప్రశ్నించగా, "విజయ్‌తో పెళ్లి ఎప్పుడు?" అంటూ మరికొందరు నిలదీశారు. "అబద్ధం చెప్పకు, ఇది నీ బ్యాచిలరేట్ పార్టీయే కదా" అంటూ కొందరు సరదాగా కామెంట్ చేశారు.

కొంతకాలంగా రష్మిక, విజయ్ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు వస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీటీవీ కథనం ప్రకారం, వీరి నిశ్చితార్థం ఈ ఏడాది అక్టోబర్ 3న జరగ్గా, 2026 ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్ వేదికగా వివాహం జరగనుందని సమాచారం. ఈ నేపథ్యంలోనే రష్మిక శ్రీలంక ట్రిప్‌పై ఈ స్థాయిలో చర్చ జరుగుతోంది.

## జనవరి 14న థియేటర్స్‌కు రానున్న
# శ్రీలీల 'పరాశక్తి'



శ్రీలీల నటించిన 'పరాశక్తి' సినిమా జనవరి 14న ప్రేక్ష కుల ముందుకు రానుంది. శివకార్తికేయన్ ప్రధానపాత్రలో వస్తోన్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో 25వ ప్రాజెక్ట్. ఇందులో రవి మోహన్, అథర్వ మురళి కీలక పాత్రలో కనిపించనున్నారు. సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తన పాత్ర గురించి శ్రీలీల ఒక ఇంటర్వ్యూలో ఇలా మాట్లాడారు. 'నిలదొక్కుకోవడానికి కొన్ని సినిమాలు చేస్తాం. కానీ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవాలంటే కొన్ని చిత్రాలు చేయాలి. ఇన్నాళ్లూ నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికే సినిమాలు చేశాను. కానీ మొదటిసారి ప్రేక్షకుల మనసులో నిలిచిపోయే ప్రాజెక్ట్‌తో రాబోతున్నాను. నా సినిమాలన్నీ ఒకెత్తు అయితే.. 'పరాశక్తి' మాత్రం ఒకెత్తు. 60లో జరిగే కథగా రాబోతుంది. నా పాత్రను సుధా కొంగర అద్భుతంగా డిజైన్ చేశారు. పాతకాలం హీరోయిన్లను చూసిన ఫీలింగ్ నా పాత్రను చూస్తే కలుగుతుంది. నటిగా నన్ను మరో మెట్టు పైన నిలబెట్టే సినిమా 'పరాశక్తి' అని భావిస్తున్నా' అని చెప్పారు.




## 19న ఓటీటీలోకి వస్తున్న
# ఐశ్వర్యా రాజేశ్ థ్రిల్లర్ మూవీ



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా, విలక్షణ నటి ఐశ్వర్యా రాజేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ 'మఫ్టీ పోలీస్' ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను అలరిం చేందుకు సిద్ధ మైంది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఆహా'లో ఈ చిత్రం డిసెంబర్ 19వ తేదీ (శుక్రవారం) నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమిళంలో 'తీయవర్ కులై నడుంగ' పేరుతో గత నెల 21న ఈ సినిమా థియేటర్లలో విడుదలైంది. తెలుగులో 'మఫ్టీ పోలీస్' పేరుతో డబ్ చేసి విడుదల చేసినప్పటికీ, సరైన ప్రచారం లేకపోవడంతో ఎప్పుడు వచ్చి వెళ్లిందో కూడా చాలా మందికి తెలియకుండా పోయింది. అయితే, థియేటర్లలో ఆకట్టుకోలేకపోయిన ఈ చిత్రం ఓటీటీలో ఏ మేరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి. ఇప్పటికే ఈ చిత్ర తమిళ వెర్షన్ 'సన్ నెక్ట్స్' ఓటీటీలో అందుబాటులో ఉంది. ఇక కథ విషయాని కొస్తే, ఒక అపార్ట్‌మెంట్‌లో రచయిత్రి జెబా దారుణ హత్యకు గురవుతుంది. ఈ కేసును ఇన్స్‌పెక్టర్ మాగుడపాటి (అర్జున్) టేకప్ చేస్తాడు. అపార్ట్‌మెంట్‌లోని ప్రతి ఒక్కరినీ అనుమానితులుగా పరిగణిస్తూ దర్యాప్తు మొదలుపెడతాడు. అసలు జెబాను హత్య చేసింది ఎవరు? ఈ హత్య వెనుక ఉన్న రహస్యాలు ఏంటి? అనే అంశాలతో ఈ సినిమా ఉత్కంఠభరితంగా సాగుతుంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**